# పేరు మీరే పెట్టండి

**అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.**

సుజాత బస్టాండులో నిల్చుంది. మధ్యాహ్నం మపటంవల్ల జనసంచారం బొత్తిగా లేదు. తలొంచుకుని ఆలోచిస్తున్న సుజాత ఒక్కక్షణం తల ఎత్తి ఎదురుగా కన్పించే దృశ్యాన్ని చూసి నోట మాట రానట్టుగా వుండిపోయింది.


ఒకతను తూలుకుంటూ వస్తున్నాడు. అతను వచ్చి బార్ పట్టుకుని నిలబడి సుజాత పైకి వాలిపోతున్నాడు. అతని కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా వున్నాయి. అతను తాగి వున్నాడేమో, తన నేమైనా చేస్తాడేమోనని దూరం దూరంగా జరుగుతోంది. అతను తూలి, తూలి సుజాతమీద పడిపోయాడు. అతనివళ్ళు విపరీతంగా కాలిపోతూండటంతో తను తప్పు చేశానన్న ఫీలింగ్‌తో ఆమె బాధపడింది. ఆటోని పిలిచింది. ఆటోవాడి సాయంతో అతనిని సుజాత ఆటోలో ఎక్కించి డాక్టరు దగ్గరకి తీసికెళ్ళింది. డాక్టరు ఇంజక్షన్ చేశాక కొన్ని నిముషాల్లో జ్వరం తగ్గటంతో అతను "నాకు సాయం చేశారు థాంక్స్! జ్వరం వచ్చినపుడు నా కళ్ళు ఎర్రబడి శరీరం వశం తప్పుతుంది. మీరేం కంగారు పడలేదుగా!" అన్నాడు.

సుజాత నవ్వి "ఆరోగ్యం జాగ్రత్త" అంటూ ఇవతలికి వచ్చేసింది.

**-కె.రఘుపతి, పి. చిలుకారావు**
(సికింద్రాబాద్)

*స్రవంతి నెం: 18లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత డాక్టర్ మట్టా సుగుణరావు పెట్టిన పేరు : డిటెక్షన్*

ఈవారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ :
శ్రీ చందు సోంబాబు



మిత్రుడు మల్లాది ఒక్క రోజు గడువిచ్చి ఈ మినీ కథల్లో రెండు సెలక్ట్‌చెయ్యమన్నాడు.

కథ రాయటం చాలా కష్టం. అదీ మినీ కథ అయితే మరీ కష్టం. కానీ ఉత్సాహంతో ఎంతో మంది రాశారు.

కేవలం రెండు కథలనే స్రవంతి ప్రచురణకి స్వీకరిస్తుంది.

ఈ శీర్షికలో పాల్గొన్న రచయితలు, రచయిత్రులు చాలా మటుకు బాగా రాశారనే అభిప్రాయం నాకు కలిగింది.

స్థాయిలో దరిదాపు అన్నీ ఈక్వల్ గా ఉన్నాయి.

1) శ్రీ ఈతకోట సుబ్బారావు—నటి.
2) శ్రీ వి. భాస్కరరావు—రాక్షసుడు

ఎన్నిక చేశాను.

నిప్పుని నివురు కమ్మినట్టు, నిజం కూడా చేదుగా వుంటుంది. అందుకే అబద్ధాన్ని నమ్మినంతగా ఈ లోకం నిజాన్ని నమ్మదు. ఆ కోవలోకే పై రెండు కథలు వచ్చాయి.

అయితే ఓ మాట.

రచయితగా కొత్త వాళ్ళని ప్రోత్సహించడం మొదట్నుంచీనాకు అలవాటు.

కొందరు రచయితలు—ఇలా కొత్తగా రాసే వారి స్థాయిని, రాసిన వాడినీ చాలా తక్కువన్నట్టు అభిప్రాయం ఇదివరలో వ్యక్త పరచారు. అలా చెప్పడం తామేదో గొప్పస్థాయిలో ఊహించుకోవడం, పర్యవసానం కొత్తవారిలో ఉత్సాహాన్ని చంపడం జరుగుతోంది.

ఈ నాడు రాస్తున్న మా స్థాయి ఒకప్పుడి ఇదే లెవెల్ అని మరచిపోకూడదు.

కొత్తవాళ్ళని ప్రోత్సాహించడం అన్ని విధాల మంచింది.

**—చందు సోంబాబు**

## నటి

మధిర ఓ అగ్రనటి. సినీ రంగంలో ప్రవేశించిన కొద్ది కాలంలోనే ఉన్నత తారాపథంవేపు దూసుకుపోయిన కళామూర్తి. మహోన్నతమైన ఆమె నటనకు ప్రజలందరూ నీరాజనాలందించారు. ఆమెకి లభించిన గౌరవప్రదమైన బిరుదులు, అభినందనలు, సన్మానాలు కోకొల్లలు.

మధిర నటించిన సినిమా విడుదలైంది. అందులో ఆమె అద్భుతంగా నటించి "కరుణ" పాత్రకు జీవంపోసింది. ఉన్నతమైన సాంఘిక విలువలకి ప్రతిబింబించే ఆ సినిమా గురించి, అందులోని హీరోయిన్ "కరుణ" పాత్రధారియైన మధిర నటన గురించి ప్రజలందరూ వేనోళ్ళ పొగిడారు. పత్రికలన్నీ బహుముఖంగా ప్రస్తుతించాయి.

ఆ సినిమా ఓ మధ్య తరగతి కుటుంబ గాధా చిత్రం. కరుణ తండ్రి పచ్చి తాగుబోతు, జూదరి. కష్టాలను కన్నీళ్ళను చిరునవ్వుతో భరించే తల్లంటే అమితమైన ప్రేమ కరుణకి. తల్లి, భర్తను గురించిన వేదనతో మంచాన పడుతుంది. తల్లిని రక్షించుకోవడం కోసం ప్రక్కఇళ్ళలో పాచిపనులు చేస్తూ, మిషనుకుడుతూ, చిన్నపిల్లలకి ట్యూషన్‌లు చెప్పుతూ పడరాని బాధలు పడుతుంది. కరుణ పడే బాధలకి మహిళాప్రేక్షకులంతా కంటతడి పెట్టుకున్నారు.

అందులోని ఓ సన్నివేశమైతే స్త్రీలోకాన్ని కదిలించి వేసింది. కరుణ తల్లితో చెప్పి పనికి వెళ్ళింది. కాసేపటికి కరుణతండ్రి తప్పతాగి తూలుతూ వచ్చాడు. డబ్బుకోసం భార్యని వేధించడం మొదలుపెట్టాడు. శరీరంలోని రక్తమాంసాలు తప్ప తాను దాచుకున్నవి ఏమీ లేవని ఏడుస్తూ చెప్పింది.

ఆమె మెళ్ళోని మంగళసూత్రం కావాలని అడుగుతాడు. హైందవ స్త్రీకి పరమ పవిత్రమైన సూత్రాన్ని త్రెంచి ఇవ్వమంటుంది. బలవంతగా తీసుకోబోతే పెనుగులాడుతూ అడ్డం పడుతుంది.

దాంతో కరుణ తండ్రి రెచ్చిపోయి ఆమె గొంతు పిసికి చంపేస్తాడు.

సరిగ్గా అప్పుడే కరుణ వస్తుంది. తల్లిని చూసి బావురుమంటుంది. ఆవేశంలో తండ్రి చొక్కాపట్టుకుని ఊపుతూ

"అంత దారుణంగా అమ్మనెలా చంప గలిగావు నాన్నా" వెక్కిళ్ళమధ్య అడిగింది కరుణ తండ్రిని.

కరుణ రసాభరితమైన ఈ సన్నివేశాన్ని మహిళలంతా ముక్తకంఠంతో మెచ్చుకున్నారు.

విచక్షణా రహితంగా భార్యని చంపిన కిరాతకుడైన తండ్రికి బుద్ధిచెప్పి తల్లి ఆత్మశాంతి చేకూర్చి, చివరికి నిజాయితీతో న్యాయస్థానానికి లొంగిపోయిన మధ్యతరగతి యువతిగా, తల్లి ప్రేమ కోసం అలమటించిన కూతురిగా, మధిర అపూర్వంగా నటించి ఆబాల గోపాలం యొక్క మన్ననలను అందుకుంది.

* * *

మధిర అభినందన సభనుంచి నేరుగా ఇంటికి

వచ్చింది. కాపుదిగగానే ఎదురుగా నిలబడివున్న విభవరాలైన ముసలామెని చూసి మొహం చిట్లించింది.

ఆమె దైన్యంనిండిన కళ్ళతో, ముహంలో ఇంత ఆశను పులుకొని మధిరవేపుచూసింది.

"ఏం! అప్పుడే తగలబడ్డావ్. మొన్ననేగా యాభై తీసుకు పోయావ్" చిరాకుగా అడిగింది.

"యాభై తీసుకొని రెండునెల్లు పైనేఅయ్యిందమ్మా. వారం నుండి తిండి లేక ఆకలితో అలమటించి పోతున్నా. కొంచెం కనికరించి దయచూపమ్మా" దీనంగా వేడ్కొంది.

పర్సులోంచి ఓ వంద తీసి ఆ ముసలిగాని మొహాన కొట్టి "ఇప్పట్లో కన్పించమాకు ఎవరైనా చూస్తే నాకు తలవంపు" కసురుకొని విసవిసా లోనికి వెళ్ళిపోయింది.

తిట్టినా, కసిరినా, తనకింత సహాయం చేసిన కూతురివేపు అభిమానంగా చూసి ఊరి చివరనున్న తన గుడిసెవేపు సాగిపోయింది వంటరి అయిన, ఓ అగ్రనటికి జన్మనిచ్చిన తల్లి. ●

**–ఊతకోట సుబ్బారావు**

---

## 'రాక్షసుడు'

నక్క భయంగా పూళపెడ్తున్నట్టుగా వినిపిస్తోంది ఫ్యాక్టరీ సైరన్....!

గేటుదాటి వెలుపలికి వస్తున్న కార్మికులకు యెదురుగా, పడమటివైపు పెద్దసైజు మాంసపు ముద్దలా కనిపిస్తున్నాడు అస్తమిస్తున్న యెర్రటి సూర్యుడు!

బయటకు వస్తున్న వందలాది కార్మికులతో పాటు ప్రకాష్ చకచకా అడుగులు వేస్తున్నాడు. సూపర్‌వైజరుగా పనిచేస్తున్న అతను ఆ రోజు తను తీసుకున్న జీతాన్ని ఏ విధంగా వెచ్చిందాలో తనెంత చురుగ్గా నడుస్తున్నాడో అంత చురుగ్గాను ఆలోచిస్తున్నాడు.

అతని పదహారేళ్ళ వైవాహిక జీవితానికి మధురస్మృతి చిహ్నం కరుణ పదేళ్ళ వయసున్న ఒక్కగానొక్క కూతురు.

ఆమెకి వయసొచ్చేనాటికి తన శక్తిమేరకు డబ్బు సమకూర్చుకుని యేదోచిన్న వుద్యోగం చేసుకునేవాడికిచ్చి పెళ్ళి చెయ్యాలని ప్రకాష్ తాపత్రయం.

ఆలోచనలతో యిల్లుచేరుకున్న ప్రకాష్ తలుపులు తట్టాడు.

"హేమా.... హేమా!" మృదువుగా పిలిచాడు.

యెంత పిలిచినా సమాధానం రాకపోయేసరికి గుమ్మానికి యెదాపెడావున్న కిటికీ తలుపులు నెట్టి చూసాడు. అవి కూడా లోపల గడియపెట్టి ఉండటంతో యేదో తెలియని అనుమానం, భయం, ఆరాటం గుండెవేగాన్ని పెంచాయి.

తలుపుకున్న తాళం బెజ్జంలోంచి వొంటి కన్నుతో లోపలికిచూసాడు. లోపలంతా చీకటి..కాని....యేదో వాసన ముక్కురంధ్రాలకు సోకగానే మనసు కీడు శంకించింది వాతావరణం చలిగావున్నా ముచ్చెమటలు పట్టాయి.

"హేమా.... బిగ్గరగా అరిచాడు. ఒక్క పరుగుతో యింటి వెనక్కివెళ్ళి పిట్టగోడదూకి లోనికి వెళ్ళాడు.

● ● ● ●

వంటిపై బట్టలేకుండా కాలి బొబ్బలెక్కి విస్రతంగావున్న హేమ మృత్యువుకు అతిసమీపంలో వుంది.

అనుకోని ఆ సంఘటనకు యేం ముంచుకొస్తుందోనన్న భయంతో, హేమను చేరబోతున్న ప్రకాష్ స్థాణువులా నిలబడిపోయాడు. వచ్చిన అందరూ అతనివైపు కొరకొరా చూసారు. వారి చూపుల్ని తట్టుకోలేక యేదో చెప్పాలనుకొని నోరుతెరిచినా తడారిపోయి మాట పెగిలి రాలేదు.

వెనకనే యస్.ఐ, పోలీసుకానిస్టేబుల్స్ వచ్చారు.

"వాడే....వాడే .... కిర్సనాయిలుపోసి నా కూతుర్ని చంపాడు. కట్నం తేలేదని రోజూ వేధించేవాడట నా చిట్టితల్లిని. పదారేళ్ళనుంచి ఈ నరకం అనుభవిస్తూనే యీ దుర్మార్గుడితో కాపరం చేసింది నిన్న వుదయమే మా యింటికి వచ్చింది. కట్నం యివ్వలేదని రోజూ కొడ్తున్నాడంటూ, యిక తనాదెబ్బలు భరించలేనని నిన్నంతా యేడుస్తూనేవుంది. త్వరలోనే యేదో విధంగా డబ్బు సర్దుతామని నచ్చచెప్పి పంపినా యీ రాక్షసుడు నా కూతుర్ని పొట్టనపెట్టుకున్నాడు" అత్తామామలు రోదిస్తూ పోలీసులకు యిచ్చిన రిపోర్టు సమగ్ర సారాంశమది.

అప్పటికే హేమ రెప్పవేయటంలేదు. యెగశ్వాసతోచివరిదశలోవున్న హేమ మరణవాంగ్మూలంగా చెప్పిన ఒక్కమాటా ప్రకాష్‌కి వ్యతిరేకంగా ధ్వనించింది!

"సా....ర్.. మా..వా. రు....... నా.... చావుకి కా...." అస్తవ్యస్తంగా, అసంపూర్తిగా పలికిన పలుకుల్లో ఒక విధమైన భయం,కంగారు ధ్వనించాయి.

● ● ● ●

"అంత దారుణంగా అమ్మనెలా చంపగలిగావు నాన్నా?" ఎక్కిళ్ళమధ్య అడిగింది కరుణ తండ్రిని.

రిమాండులోవున్న అతని ఘనీభవించిన హృదయం మంచుకరిగినట్టు కరిగి కళ్ళవెంట ధారాపాతంగా వర్షించాయి.

"అంత మాటనకు తల్లీ!.... పాపభీతిలేని యీ లోకం, సత్యం....ధర్మం.... న్యాయం.... పూర్తిగా అడుగంటిన యీ లోకం నన్నేమన్నా బాధలేదు. న్యాయదేవత కళ్ళకి, చెవులకి నల్లపర్దకట్టి సత్యం.. ధర్మం.. న్యాయాలకి నల్లటి ముసుగువేసిన యీనాటి న్యాయవ్యవస్థ నన్ను హంతకునిగా ముద్రవేసి వురిశిక్ష వేసినా సంతోషంగా అనుభవిస్తాను. పైలోకంలో నా కోసం

స్రవంతి నెం: 16లో ఇచ్చిన "అంత దారుణంగా అమ్మనెలా చంపగలిగావు నాన్నా?" ఎక్కిళ్ళ మధ్య అడిగింది కరుణ తండ్రిని.
వాక్యం ఆధారంగా రాసినకథలు.

ఎదురుచూసే నా హేమను చేరుకుంటాను.కాని.. కాని.... నువ్వు పసిదానివి దైవంతో సమానం!!.... అందుకే యెవ్వరిముందూ నోరువిప్పని నేను నీకు చెబుతున్నాను....!

కట్నం గురించి కాని, అన్యాయంగా వచ్చిపడే యితరుల ఆస్తులకోసం కానీ నేనేనాడూ ఆశించలేదు. ఆ విషయం మీ అమ్మకూ తెలుసు! ఒకసారి యేమందో తెలుసా?...."

శూన్యంలోకి చూస్తూ చెప్తున్న అతని కళ్ళలో నీళ్ళు సుడులుగా తిరుగుతున్నాయి....

"యేమండీ.... మీరెంత అమాయకులండీ?! మనకున్నది ఆడపిల్ల, యీ రోజు మీరు కట్నం తీసుకోలేదని రేపు మన అమ్మాయిని కట్నం లేకుండా పెళ్ళిచేసుకోవటానికి యెవరన్నా వస్తారా? .... అందుకే.... దానికోసమే.. దేవుడిలాంటి మిమ్మల్ని కట్నంకోసం వేధించే రాక్షసుడిగా చిత్రించి అమ్మానాన్నలకు అబద్ధం చెబుతున్నాను.... యీ విషయంలో మీరేం మాట్లాడవద్దని గోముగా చెప్తూ నన్ను బుజ్జగించేది. పైగా వాళ్ళగనక కట్నం యివ్వకపోతే నాకు మళ్ళీ పెళ్ళిచేస్తానని ఫక్కున నవ్వేది...."?"

జ్ఞాపకాలు తలుచుకుంటూ ఆ చిన్ని న్యాయదేవత 'కరుణ'కు చెబుతూనేవున్నాడు ప్రకాశ్.

**–వి. భాస్కరరావు**

---

### ఓ కథ రాయండి

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

"ఈ గ్లాసులోని పాలను మూడు భాగాలుచేసి ఒకదాంట్లో మాత్రమే అదిగో ఆ పొట్లంలోని విషాన్ని కలిపి నాకివ్వండి" చెప్పాడు వీరేంద్ర తన ఇద్దరి స్నేహితులతో.